నేరస్థుడు

"రవి - చంద్ర"

—*—

కోర్టు క్రిక్కిరిసి ఉంది. కిటకిటలాడే జనం, 'కట కటా' అని నోట అనకున్నా, బోనులోని జీవి యాకారాన్ని, ముఖాన్ని చూచి ఆర్ద్రహృదయంతో స్తబ్ధులై యావత్తు వినడానికి సంసిద్ధులైయున్నారు.

ఒకమోస్తరుగా పేరుమోసిన ఆసామీని చచ్చేట్టు చితకబాదటమే ఆ 'దోషి'యొక్క నేరం. అతణ్ణి నిజంగానే నేరస్థుడంటారు కదూ మీరు? అవును — అలానే మీరు అనగలరు. కాని, ఆ నేరస్థుడు — కాదు, ప్రాణి - పేరుప్రతిష్ట లార్జించుకొన్న జడ్జి జగన్నాధాన్నే సంక్షోభంలో ముంచేశాడు.

జడ్జి ప్రవేశించాడు కోర్టులోకి. గౌరవ సూచనలన్నీ జరిగాయి. యధావిధిని అలవాట్లన్నీ పూర్తయాయి. ఒక్కసారి నల్లటి కళ్ళజోడు సరిజేసి చూశాడు జగన్నాధం. మళ్ళీ నిన్నటి మొహం! మళ్ళీ తన హృదయంలో నిన్నటి అపశ్రుతే; అపస్వరమే! ఎందుకో అతన్ని చూచినప్పట్నుంచీ తనకీ ఆందోళన; ఆలోచన. బహుశః ఆ మొహం ఆందోళనా వేదనలకు, ఆలోచనలకు ప్రతిరూపమేమో! ఇలా పిచ్చిగా ఏమిటో ఆలోచిస్తూనే నిన్న ఏదో సాకుపెట్టి, కేసు వాయిదా వేసి, లేచి వెళ్ళిపోయాడు.

ఇక —

"నీది నేరమని ఒప్పుకుంటావా?" - ఎలాగో ఒకవిధంగా ప్రారంభించాలని సూటిగా ప్రశ్నించాడు ప్లీడరు.

ఆ యువకరక్తం ఉడికింది - ఉప్పొంగింది.

"నేరం?!" ఘట్టిగా పిచ్చిగా అరిచాడు దోషి.

జగన్నాధం అదిరిపడ్డాడు. కుర్చీలో ఓ మూలగా ఒరిగి తలెత్తి చూశాడు.

"నేరం? ఏది నేరం? నే చేసింది నేరమేనా?" — నేరస్థుని ప్రశ్నపరంపర కర్కశంగా తోచింది అతనికి. ఈసారి తనలోని హృదయాన్ని కోర్టువతలికి గెంటి దీక్షతో వింటున్నాడు జగన్నాధం.

యువకుడు ఉరకలేస్తున్నాడు.

"...మీరడగాల్సిన ప్రశ్న అదికాదు. 'నీ నేరానికి కారకులెవ్వరు'ని అడగండి. అప్పుడు మీకు నిసలైన దోషి దొరికేవాడు. ఈ నా నేరానికి ముందు వెనుకలు నాకు తెలిసినంత మీకెవ్వరికీ తెలీదు. బాగా వినండి. విన్నతర్వాత నేరం మోపండి...

...ములములమాడ్చే మండుటెండలో మడతలుపడ్డ కడుపుతో అతని గడప త్రొక్కిన వేళావిశేషమది. అతనిలా గాక నా స్థితి ఇంకా అధ్వాన్నంగా ఉందని పాపం అతనికి తెలీదు. అలాగయ్యుంటే ఈ పరిస్థితులేర్పడి యుండేవికావు. అతని స్థితిగతుల గురించి మీకు తెలిసిందానికన్నా నాకింకా ఎక్కువ తెలుసు. నిర్దోషి తన నిర్దోషిత్వాన్నెంత గోడు పెట్టుకున్నా వినడానికింపుగా ఉండదు. ఐనా, నేనెఱిగిందంతా చెప్పక మానను.

కంపెనీలో అవకతవకలు చేశాడా 'నిర్దోషి' వెచ్చించిన డబ్బు సమర్పించుకోవాలి. అంతకాకపోయినా కొద్దో, గొప్పో ఉన్నవాడే. మరయితే, ఆ డబ్బేం చేశాడంటారా? "మద్యపాన నిషేధ సమితి' వాళ్ళకి, 'పోలీసు' వాళ్ళది ఆ పని. కంపెనీ వారు దయతలచి ఒకరోజు గడువిచ్చారు. అతని స్థితి అయోమయం - అగమ్యం. అప్పుడే అతనిలా నేను దాపురించాను. అతని పరిస్థితి నాకు పూర్తిగా అవగతం.

"కంపెనీలో నౌఖరీ" — అని నేను నసిగాను. నాకున్న 'ఆశ' అంతా అతనిమీదే. అతనే నా నావకు చుక్కాని. ఆ చుక్కాని విరిగేలోపుగా, నా నావను ఒడ్డుకు చేర్చాలని నా ఉబలాటం.

"ఛీ, నడు అవతలకి" అని అతడు కసిరాడు. కాని నేను వదలని జిడ్డులాగ పట్టుకున్నాను. ఎంతకీ కదిలాను కాదు. అప్పటికే నా ఖర్మ పరిపక్వమైంది. అతడు రెచ్చిపోయాడు — మండిపోయాడు. కాని, మండిపోతున్న నా గుండెను, కాలిపోతున్న నా కడుపును గమనించలేదు.

కోపంతో ఒక్క ఉరుము ఉరిమాడు. అతనిలోని బాధ, భయం, అవమానం అన్నీ నామీద కోపంగా మారాయని ఇట్టే గ్రహించాను. గజగజ వణికిపోయింది నా శరీరం. అతని రూపం ఇప్పటికీ నాకు భయంకరంగానే ఉంది. అతనిలోకి రాక్ష

సత్వం ప్రవేశించిందని అతని చూపులు నన్ను హెచ్చరించాయి బయటపడాలనే ప్రయత్నించాను. కాని... కాని, అప్పటికే వీపు చిట్లింది. బాధతో మూలుగుతూ తిరిగి చూశాను... అతని చేతిలో – రక్తంతో తడిసిన కొరడా! మరుక్షణమే మళ్ళీ నాలుగు తగిలించాడు. మూర్ఛ వచ్చినంత పనయింది. తూలిపోయాను. ఒళ్ళంతా హూనమైంది. అబ్బ, ఆ బాధ అనుభవించాల్సిందే కాని..." – ఒక్క దీర్ఘమైన నిశ్వాసము వదిలాడు. ఒక్క క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించాడు.

ఎప్పుడు ప్రవేశించిందో జడ్జిగారి హృదయం జగన్నాథం దేహంలోకి దూసుకెళ్ళింది.

"...అలాగే వీధిలో పడిపోయాను. నలుగురు పోగయ్యారు. ఎందుకు? వేడుక చూడ్డానికి! నేను దెబ్బలు తిన్నానన్న బాధేలేదు కాని, నా అభిమానం దెబ్బతిన్నందుకు సహించలేకపోయింది. మూగిన జనం మూగజనంలా ఆ రుద్రుణ్ణి ఆపలేదు. రెచ్చిపోయిన నేను చేతికందిన బండతో తల పగిలేట్టు అతన్ని పడగొట్టాను. తర్వాత నేనేం జేశాను నాకు తెలీదు – మీకు తెలిసుంటుంది... కాని, దైవముపై ప్రమాణంచేసి చెప్తున్నాను. గడ్డకట్టిన నా హృదయం ఇప్పుడు ద్రవిస్తోంది; నాలాగే అతడూ ఓ మానవుడేనని నాలో కదుల్తున్న కరుణ స్ఫురింప చేస్తోంది; నాలో పశ్చాత్తాపం ఉరకలేస్తోంది... ఇదంతా నా నేరమేనా? ఇందులో ఎంత భాగం నా నేరం? నాకు విధింపబోయే శిక్షలో భాగం ఇంకెవ్వరికీ లేదా? ఈ న్యాయస్థానంలో నిజమైన..."

"...ఆపు, మరీ మితిమీరకు. నీకు నీవే వాదించి న్యాయం స్థిరపరచుకొందుకు నీ విక్కడకు రాలేదు." – అని మధ్యలోనే అందుకున్నాడు కఠినంగా ప్లీడరు.

ఏదో మాట్లాడాలనుకున్నాడు జగన్నాథం. కాని, ఇంకేదో మాట్లాడేశాడు –

"కాని,...ఇది గమనించు...ఏది చేసినా ముందు వెనుకలాలోచించాలి. నిన్ను కొట్టాడన్న నీవతణ్ణి చంపడానికి అర్హత నీకు లేదు."

మళ్ళీ దోషి మధ్యలోనే అందుకున్నాడు.

"...అది సాధ్యమేనంటారా? ప్రపంచ సామాన్యవిషయమేనంటారా? అదే సాధ్యమయితే లోకమంతా మహాపురుషులతో నిండిపోదూ? ఇంతెందుకు, ఈ నీతిని బోధించిన మీరు – క్షమించండి మొన్న ప్రొద్దుటి వృత్తాంతం మననం చేసుకోండి."

జగన్నాథం ఆకళింపుకు తెచ్చుకున్నారు. అతని ముఖకవళికలు తత్క్షణం ముడతలుపడి అసౌఖ్యాన్ని వెల్లడించాయి. ఒక్కసారి అవమానంతో కుంచించుకు పోయి, కుర్చీలో ముడుచుకుపోయాడు.

♦ ♦ ♦

ఆరోజు తను మడిపంచె మామిడిచెట్టుకి కట్టాడు. బావి దగ్గర స్నానంచేశాడు. పంచె ఇంకా ఆరలేదు, బయలు కాబట్టి – అందులో వయసు మళ్ళినవాడు కాబట్టి – చలిబుట్టి వణికిపోతున్నాడు. క్రితంరాత్రి భార్యతో కలహం, తత్కారణం, తత్ఫలితం యావత్తు జ్ఞప్తికిరాగానే ఒళ్ళంతా కోపంతో, కోపంతో ఒక్క-ఊపు ఊగిపోయింది... అంతంలేని ఈ కలహాలని తను తీర్చలేకపోతున్నాడు. తన పేరు ప్రతిష్ఠలకే ఎగ్గొపెడుతోంది అది. నలుగురూ నాలుగు మాటలంటే ఇంకేముంది? ఛీ, రాత్రే చెప్పకుండా పుట్టింటి కెళ్ళిపోయింది. పుట్టిల్లు నాలుగో వీధైనా, భర్తకు చూపాల్సిన మర్యాదేనా చూపిందా? ఛీ, ఎవరేనా వింటే ఎంత అవమానం! కోపం రెచ్చిపోయింది... చెట్టు గలగలమంది. తను తల పైకెత్తి చూశాడు... న్యాయమూర్తి ఇంట్లోనే నేరమా? దండించకపోతే లాభం లేదనుకున్నాడు.

"దొంగకుంక! కాపు కాచిందంటే చాలం"టూ చేతికందే ఆ కుర్రాడిని దబుక్కున క్రిందికి లాగేశాడు. ఒళ్ళంతా ధూళితో నిండి, ఏలాటి సంస్కారణ లేని మానవాకారం ఆ కుర్రకుంకది. ఓ పన్నెండేండ్లుంటాయేమో!

క్రిందపడటంతో పాపం చేతియెముక విరిగింది. 'కుయ్యో' మన్నాడు.

"అయ్‌గోరూ! ఇంకెప్పుడూ సేయనం"టూనా వినిపించుకోక పశువుల్ని కట్టే పలుపుతో బలంకొద్దీ బాదాడు.

నెత్తీ, నోరూ మొత్తుకున్నాడు పసివాడు.

'హుఁ' అని హుంకరించాడు తను.

హూనమైన లేత దేహంతో గోడెక్కాడు సగం చచ్చిన కుర్రాడు.

చెట్టుమీదనుండి క్రింద పడటంలో తెల్లటి మల్లెపూవులాంటి పంచంతా మసిపూశాడు ఆ ఏ పాపం తెలీని అగాయకుడు. కోపం మరీ రెచ్చిపోయింది తనకి.

'ఏది చేసినా ముందు వెనుక లాలోచించాలి' - అన్న తన ప్రస్తుత సూత్రం ఆ స్థలిని మంటగలిపి, మండిపోయి, నలిగిన శరీరానికి వేదనిస్తున్న పిల్లవాణ్ణి అంత ఎత్తునుండి అవతలకి దబుక్కున తోసేశాడు తను. తనెంత రాక్షసుడు!

ఆ తర్వాత జగన్నాథం ఏమీ ఆలోచించక, గబగబ స్నానం ముగించి, పట్టుపంచె కట్టి, తనకేమీ తెలీనట్టు - అసలేమీ జరగనట్టు - దినశేషాన్ని గడిపేశాడు.

♦ ♦ ♦

బోనులోని మనిషి ఇంకా వాగుతూనే ఉన్నాడు ఏమిటేమిటో.

'ఆ కుర్రాడెవరడు?' అని ఆత్రుతతో ప్రశ్నించాడు జగన్నాథం.

అక్కడెవ్వరికీ - మీకుమల్లే అది కోర్టనిపించ లేదు. "దేవుని పేరిట చెప్పు...ఆ కుర్రాడెవడు? ఎవరికేమౌతాడు?" ఏం తోచక, వణికే కంఠంతో ప్రశ్నించాడు జగన్నాథం.

"అయ్యో పాపం, ఎందుకంత జాలి? వాడు మీకేం కాడు, నాకే తమ్ముడౌతాడు" - దోషి కంఠంలో అవహేళన ప్రస్ఫుటించింది. అది మానవ సహజమే కదా! ఎదుటివారి పతనం వివరమైతే ఇవతలివారిది స్వేచ్ఛాపతంగ విహారమే కదూ?

"ఏకోదరుడా?" - జగన్నాథం గొంతుకలో ఎంతో కుతూహలం నిండింది.

"కాదు...కాని, ఏకోదరుడు కాని సహోదరుడు. నాలాగే అతనూ ఓ అనాథుడు, అనాథుడు. పోతున్న నా ప్రాణాన్ని - నాకెవ్వరూ చేయని కార్యం - గుక్కెడు నీళ్ళతో మళ్ళీ దానం చేశాడు. ఇప్పుడు వెళ్ళిపోయాడు."

"ఎక్కడికెళ్ళాడు? - ఎలాగున్నాడు? - ఇప్పుడెక్కడున్నాడు?" జగన్నాథం గబగబా ప్రశ్నించాడు పిల్లవాని స్వంత తండ్రిలా.

"హుఁ, ఎక్కడుంటేనేం, ఎలాగుంటేనేం? అంతా అయిపోయింతర్వాత?" - అతని కంఠంలో జగన్నాథానికి దైవఘోష వినిపించింది.

"అంత అయిపోయిందంటే?" - భయంతో వణికిపోయిందతని కంఠం. వళ్ళంతా స్వేద జలసిక్తమైపోయింది.

"...మీరనుకుంటున్నదే" - తాపిగా జవాబు వచ్చింది బోనులోంచి.

"చనిపోయాడా" - జగన్నాథం పశ్చాత్తాపం ఊహాతీతం.

"ఆ మాట వినలేను."

"నిజంగా పోయాడా?...హే భగవాన్ నన్ను క్షమించు" అంటూ పశ్చాత్తాపంతో, పాపభారంతో టేబుల్ మీదికి అచేతనంగా వాలిపోయాడు జగన్నాథం. కోర్టులో కలకలం రేగింది; చలనం కలిగింది. పోలీసులు దోషిని బంధించి తీసుకుపోయారు.

జగన్నాథం ఇల్లు చేర్చబడ్డాడు.

♦ ♦ ♦

మరునాడు మళ్ళీ బోనెక్కాడు దోషి. తలెత్తి చూచి చలించాడు. ఈసారి జడ్జి జగన్నాథం కాదు. ఏదో క్రొత్తమొహం.

జనంలో ఎవరో పెద్దగా అనుకుంటుంటే విన్నాడు దోషి: "పాపం పాతజడ్జికి పక్షవాతమట."

విచారణ పూర్తయింది. న్యాయదృష్ట్యా దోషికి శిక్ష విధించింది కోర్టు.

కాని అసలు శిక్షలు విధించేది దేవుడు.

Grams: 'LODHRA' Phone: 86637

Grihalakshmi

Illustrated Telugu Monthly

Published on every 15th

Advt. Rates

Ordinary page	... Rs. 60/-
2nd Wrapper single colour	... Rs. 80/-
3rd ,, ,,	... Rs. 80/-
4th ,, ,,	... Rs. 100/-

Only mounted blocks are accepted.

Halftones not finer than 75 screens.

Last date for receiving advt. lay-outs and blocks—15 days in advance of the date of publication.

All communications and materials may be addressed to:

THE ADVT. MANAGER,
"Grihalakshmi"
Royapettah, Madras-14.